

సమాజం అండతోనే పద్మశ్రీ
సమాజ అండదండలతోనే తనకు పద్మశ్రీ అవార్డు లభించిందని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ అన్నారు. - 8లో▸



సమన్వయంతోనే పుష్కరాలు సక్సెస్ - 8లో▸
అధికారులు, ప్రజల సమన్వయంతోనే సరస్వతీనది పుష్కరాలు విజయవంతమయ్యాయని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు.

గరిష్ఠం/కనిష్ఠం 39°/27°

వాతావరణం
జిల్లాలో ఉదయం గాలివాన కురిసే అవకాశం ఉంది. మధ్యాహ్నం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. సాయంత్రం అక్కడక్కడా చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

విదేశాల్లో విద్యకు దరఖాస్తుల ఆహ్వానం

న్యూశాయంపేట: పేద మైనారిటీ వర్గాల వారు విదేశాల్లో విద్యనభ్యసించేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంప్రవేశపెట్టిన సీఎం ఓవర్‌సీస్ స్కాలర్‌షిప్ పథకం కింద అర్హులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని వరంగల్ జిల్లా మైనారిటీ సంక్షేమాధికారి టి.రమేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పథకం ద్వారా అమెరికా, కెనడా, ఆస్ట్రేలియా, లండన్, ఫ్రాన్స్, జపాన్, సౌత్‌కొరియా, న్యూజిలాండ్, సింగపూర్ దేశాల్లో పీజీ, పోస్ట్ డాక్టరోల్ విద్యనభ్యసించే వీలుందని పేర్కొన్నారు. ఈనెల చివరి వరకు గడువు ఉందని, పూర్తి వివరాలకు హనుమకొండ సుబేదారిలోని కార్యాలయంలో లేదా 93988 60995 నంబర్‌లో సంప్రదించాలని ఆయన సూచించారు.

లైంగిక వేధింపుల ఫిర్యాదులకు ప్రత్యేక కమిటీలు

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి వీబీ.నిర్మలా గీతాంబ



వరంగల్ లీగల్: లైంగిక వేధింపుల ఫిర్యాదులను పరిష్కరించడానికి ప్రత్యేక కమిటీలు ఉన్నాయని వరంగల్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి వీబీ.నిర్మలా గీతాంబ అన్నారు. 'పని ప్రదేశాల్లో లైంగిక వేధింపుల నుంచి మహిళలకు రక్షణ ప్రోష్ యాక్ట్ -2013' చట్టంపై జిల్లాల ప్యానెల్ న్యాయవాదులు, పారా లీగల్ వలంటీర్లకు వరంగల్, హనుమకొండ జిల్లాల న్యాయసేవాధికార సంస్థలు సంయుక్తంగా శనివారం అవగాహన సదస్సు నిర్వహించాయి. ఈ సందర్భంగా హనుమకొండ ఇన్‌చార్జ్ ప్రధాన న్యాయమూర్తి బి.అపర్ణాదేవితో కలిసి ప్రధాన న్యాయమూర్తి నిర్మలా గీతాంబ మాట్లాడారు. పని ప్రదేశంలో మహిళలపై లైంగిక వేధింపుల నివారణ, పరిష్కారానికి చట్టాలు ఉన్నాయని పేర్కొన్నారు. లైంగిక వేధింపులు ఎదురైనప్పుడు న్యాయ సహాయం ఎలా పొందాలి, ఎవరిని ఎలా సంప్రదించాలో న్యాయమూర్తులు రితిక, ఫరీనా అహ్మ, డాక్టర్ అనితారెడ్డి వివరించారు. కార్యక్రమంలో వరంగల్, హనుమకొండ జిల్లాల న్యాయ సేవాధికార సంస్థల కార్యదర్శులు ఎం.సాయికుమార్, క్షమాదేశ్ పాండే, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వి.సుధబుర్, తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో వేగం పెంచాలి

- హనుమకొండ కలెక్టర్ పి.ప్రావీణ్య



హన్మకొండ అర్బన్: హనుమకొండ జిల్లా వ్యాప్తంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనుల్లో వేగం పెంచేలా అధికారులు చర్యలు చేపట్టాలని కలెక్టర్ పి.ప్రావీణ్య ఆదేశించారు. కలెక్టరేట్ కార్యాలయ సమావేశ మందిరంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక, పొజిషన్ సర్టిఫికెట్లు, రెవెన్యూ సదస్సులు, రాజీవ్ యువ వికాసం, తదితర అంశాలపై అధికారులతో శనివారం సమీక్షించారు. జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం జరుగుతున్న తీరును గృహ నిర్మాణ శాఖ డీఈ సిద్ధార్థ నాయక్ వివరించారు. కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ ఈడీ బాలరాజు, నగర కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, అదనపు కలెక్టర్ వైవీ.గణేష్, ఆర్డీఓ కె.నారాయణ, డీపీఓ లక్ష్మి రమాకాంత్, మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ జి.రవీందర్‌తో పాటు ఎంపీడీఓలు, తహసీల్దార్లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై ముందస్తు ప్రణాళికలు

- డీఎంహెచ్‌ఓ అప్పయ్య



ఎంజీఎం: వర్షాకాలంలో వ్యాధులు వ్యాప్తి చెందకుండా ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాలని వైద్య సిబ్బందిని హనుమకొండ డీఎంహెచ్‌ఓ అప్పయ్య ఆదేశించారు. జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ సమావేశ మందిరంలో ల్యాబ్ టెక్నీషియన్లు, హెల్త్ సూపర్‌వైజర్లు, మలేరియా నోడల్ పర్సన్స్, హెల్త్ అసిస్టెంట్లతో శనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమలు వృద్ధి చెందకుండా ఎలాంటి చర్యలు తీసుకోవాలో ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలని సూచించారు. వర్షాకాలంలో వ్యాప్తి చెందే వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. వివిధ విభాగాలతో కలిసి మంగళవారం, శుక్రవారం డ్రై డే పాటించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో అడిషనల్ డీఎంహెచ్‌ఓ మదన్‌మోహన్, వైద్యుడు నరేష్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



రెక్కలు విప్పిన ఆనందం

సండే స్పెషల్



ఆయనో గీత కార్మికుడు.. ఆకాశాన్నంటే తాటిచెట్టును అవలీలగా ఎక్కేస్తాడు. ఆకాశంలో ఎగిరే విమానాన్ని ఎక్కడం జీవితంలో సాధ్యపడదనుకున్నాడు. ఊరి పరపతి సంఘం ద్వారా ఆ కల సాకారమైంది. ఆమె ఒక వ్యవసాయ కూలీ. పనిచేస్తేనే ఐదు వేళ్లు నోట్లోకి వెళ్లే పరిస్థితి. ఎప్పుడైనా విమానం కనిపిస్తే రెండు చేతులు నుదుటిపై పెట్టి ఆసక్తిగా గమనించేది. ఆమె చేసిన అతి చిన్నమొత్తం పొదుపే ఫ్లైట్ ఎక్కేలా చేసింది. మొదటిసారి విమానం ఎక్కిన ఆమె పట్టరాని సంతోషంతో ఎగిరిగంతేసింది. ఈ ఊరిలో వీరే కాదు.. రైతులు, వివిధ వృత్తుల వారు కుటుంబ సమేతంగా విమానయానం చేశారు. ఆకాశంలో విహరించారు. మబ్బుల పక్క నుంచి ప్రయాణించిన వారి అనుభూతికి 'సాక్షి' అక్షర రూపం ఇచ్చింది. అదే ఈ వారం సండే స్పెషల్ స్టోరీ..

- వరంగల్ డెస్క్

- పరపతి సంఘం ద్వారా సామాన్యుల విమానయానం
- కల నెరవేర్చుకున్న రైతులు, కూలీలు, వృత్తిదారులు
- కుటుంబ సమేతంగా ఛార్‌ధామ్, ఆగ్రా, కాశీ విహారయాత్రలు
- దేశాన్ని చుట్టివస్తున్న చిన్నపెండ్యాల గ్రామస్తులు

ప్రముఖులెవరైనా సభకో, సమావేశానికో వస్తే వాళ్లంతా వరుసకట్టేవారు. వారి మాటలు వినడానికో, సమావేశంలో పాల్గొనడానికో కాదు.. వారిని తీసుకొచ్చిన హెలికాప్టర్‌ను చూడ్డానికి.. అది కూడా అరకిలోమీటరు దూరం నుంచి.. జీవితంలో ఒక్కసారైనా కనీసం వాటిని తాకుతామా? అని ఆలోచించేవారు. కానీ చిన్నమొత్తాల పొదుపే వారిని ఆకాశంలో విహరించేలా చేసింది. జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ మండలం చిన్నపెండ్యాల గ్రామస్తుల కలలకు రెక్కలు తొడిగింది.

విమానం పోతుంటే చూసేటోడిని.. నా కులవృత్తి తాళ్ల ఎక్కడం. రోజూ ఉదయం, సాయంత్రం తాటిచెట్లు ఎక్కి కల్లు అమ్ముకుంటాం. బయటి ఊర్లకు ఎక్కువగా వెళ్లింది లేదు. ఎప్పుడైనా ఆకాశంలో విమానం వెళ్తుంటే తాటిచెట్టుపైనుంచి చూసేటోడిని. కానీ ఆ విమానం నేను ఎక్కగలనా.. అనుకున్నా. ఆ కల నెరవేరింది. పరపతి సంఘం ద్వారా సభ్యులంతా కుటుంబంతో కలిసి ఛార్‌ధామ్‌యాత్రకు విమానంలో వెళ్లాం. మొదటిసారి విమానం ఎక్కినప్పుడు ఎంతో సంతోషం వేసింది.

- గీసగోని రాజయ్య, గీతకార్మికుడు



ఛార్‌ధామ్ ఆలయం వద్ద సభ్యులు (ఫైల్)

పరపతి సంఘాలు.. ఐకమత్యానికి నాంది

చిన్న పెండ్యాల గ్రామంలో సుమారు 250 కుటుంబాలు ఉంటాయి. వీరి ప్రధాన జీవనాధారం వ్యవసాయం, కులవృత్తులు. మబ్బుల్నే నిద్రనుంచి లేవడం, పొలంబాట పట్టడం, వ్యవసాయ పనులు చేసుకుని సాయంత్రానికి ఇంటికి చేరడం వీరి రోజువారీ విధి. వరంగల్, జనగామ, మహా అంటే హైదరాబాద్ తప్ప ఇతర పెద్ద నగరానికి వెళ్లింది లేదు. బస్సు, కారు తప్ప ఇతర వాహనం ఎక్కింది లేదు. కానీ వారిలోని ఐక్యమత్యం.. వారిని రాష్ట్రం దాటించింది. ఎప్పుడూ ఆకాశంలో వెళ్తుంటే చూసిన విమానాన్ని సైతం తమ దరికి చేర్చింది. పరపతి సంఘాల ఏర్పాటుతో రూపాయి, రూపాయి పొదుపు చేసుకుని అందులోనుంచే ఖర్చు చేసి విమానాన్ని ఎక్కారు. ఎప్పుడూ చూడలేమనుకున్న అనేక ప్రాంతాలను చుట్టివచ్చారు. ఈ గ్రామంలో మొత్తం కలిపి 22 పరపతి సంఘాల దాకా ఉంటాయి. అందులో పెద్దవి ఐదు (చైతన్య, ప్రగతి, శ్రీలక్ష్మీ, సిరి, శ్రీగణేశ్) ఉన్నాయి. ఇందులో అన్ని కులాలు, వృత్తుల వారు సభ్యులుగా ఉన్నారు. ప్రతీ సభ్యుడు నెలకు రూ.100 వేసుకుంటున్నారు. ప్రతీనెలా ఒకరు ఎత్తుకుని 1 శాతం చొప్పున వడ్డీ కడతారు. ఇలా కొన్నేళ్లుగా జమచేసిన డబ్బులే వారి ఆర్థిక ప్రగతికి సహకారం అందిస్తున్నాయి.



విమానం ముందు గ్రామస్తులు(ఫైల్)



సెల్ఫీ తీసుకుని మురిసిపోయా..

గ్రామంలో అందరం కుటుంబ సభ్యుల్లా ఉంటాం. గ్రామం దాటి బయటికి వెళ్లింది లేదు. కానీ, పరపతి సంఘం ద్వారా ఫ్లైట్ ఎక్కినం. మొదటిసారి విమానం ఎక్కిన అనుభూతి మాటల్లో చెప్పలేనిది. నేను, నా భార్య విమానంలో సెల్ఫీ తీసుకుని మా బంధువులకు పంపి ఆనందపడ్డాం. ఈసారి పూరి జగన్నాథ్‌యాత్రకు వెళ్దామనుకుంటున్నాం.

- కీర్తిసత్యం, గ్రామస్తుడు, చిన్నపెండ్యాల

గాల్లో వెళ్తుంటే బాగుంది..



గ్రామంలో రోజూ కూలి పనికి వెళ్తా. వరినాట్లు, ఇతర వ్యవసాయ పనులకు వెళ్తుంటా. మేం పరపతి సంఘంలో సభ్యులుగా చేరాం. అందరితో కలిసి విమానం ఎక్కిన తర్వాత మొదట కొంచెం భయం వేసింది. ఆ తర్వాత గాల్లో వెళ్తుంటే బాగుంది. యాత్రలో అందరితో కలిసి పడవ ఎక్కినం, స్టీమర్ ఎక్కినం. ఛార్‌ధామ్ యాత్రలో గుర్రాలు ఎక్కినం. పరపతి సంఘం ద్వారా ఇదంతా సాధ్యమైంది.

- రామగిరి సరోజ, వ్యవసాయ కూలీ, చిన్నపెండ్యాల

అందరి కృషి..



పల్లెటూరి వాళ్లను కంపల్సరీ ఫ్లైట్ ఎక్కించాలని అనుకున్నాం. అందుకు ఏం చేయాలని మీటింగ్ పెట్టి నిర్ణయించుకున్నాం. డబ్బులు సమకూర్చుకున్నాం. అనుకున్నట్లుగానే టూర్‌కు వెళ్లాం. ఛార్‌ధామ్ యాత్రకు వెళ్లాం. ఇది మా అందరి కృషి. రోజూ కూలీ పని చేసే వాళ్లం. విమానాశ్రయానికి వెళ్లాక అందరి కళ్లు ఆనందభాష్పాలను రాల్చాయి.

- చావ కుమారస్వామి, మల్లారెడ్డి, సంఘం సభ్యులు చిన్నపెండ్యాల





ఆగ్రాలోని తాజ్‌మహల్ ఎదుట గ్రామస్తులు (ఫైల్), ఎయిర్‌పోర్ట్‌లో సేదదీరుతున్న మహిళలు

ఆలోచన వచ్చిందిలా..

పరపతి సంఘాల సభ్యులంతా 2023లో కాశీకి వెళ్లాలనుకున్నారు. 'రెక్కల కష్టం నమ్ముకున్నాం.. జీవితంలో ఒక్కసారైనా విమానం ఎక్కుదాం'.. అని సభ్యులు తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేయగా.. 50 కుటుంబాలు (భార్యాభర్త) విమాన ప్రయాణానికి ఎంత ఖర్చు అవుతుందని సంబంధిత టూర్స్, ట్రావెల్స్ వాళ్లను అడగగా రూ.20 నుంచి రూ.24 లక్షలు అవుతుందని చెప్పారు. ఇందుకు అవసరమైన డబ్బుల కోసం కమిట్‌మెంట్ చిట్టీలు వేసుకుని రూ.20 లక్షలు పోగేసుకున్నారు. చేతి ఖర్చుకు ఒక్కో కుటుంబం రూ.10 వేల వరకు దగ్గర ఉంచుకుంది. ఇంకేముంది వారనుకున్న విమానయాన కల నెరవేరింది. ఇలా ఒక్కసారి కాదు.. ఇప్పటికే ఐదుసార్లు తమ కలను నెరవేర్చుకున్నారు.

ఎక్కడికెళ్లినా ఫ్యామిలీతోనే..

గ్రామ పరపతి సంఘాల సభ్యులు ఇప్పటివరకు ఛార్ ధామ్, కాశీ టూర్, రామేశ్వరం, ఢిల్లీ, ఆగ్రా యాత్రలకు వెళ్లారు. నగరంలోని హనుమకొండలోని ఓ ప్రైవేట్ ట్రావెల్స్‌కు డబ్బులిస్తే వాళ్లు మొత్తం ఏర్పాటు చేశారు. హైదరాబాద్ నుంచి విమానంలో వెళ్లి.. అక్కడ ప్రత్యేకంగా బస్సు మాట్లాడుకుని ప్రదేశాలకు తిరిగారు. ఆవిమానం మొత్తం ఒకే ఊరు వాళ్లు ఉండడం.. మొదటిసారి విమానం ఎక్కిన వారి ఆనందానికి అవధుల్లేకుండా పోయింది.

నేర రహిత సమాజమే లక్ష్యం

- పరకాల ఏసీపీ సతీష్‌బాబు



కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

పరకాల: నేర రహిత సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పరకాల ఏసీపీ సతీష్‌బాబు కోరారు. అసాంఘిక శక్తులు శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే సహించేది లేదని స్పష్టంచేశారు. పోలీసులు, ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ ఆధ్వర్యంలో పరకాల పట్టణంలోని బీసీ కాలనీ నుంచి పరకాల బస్టాండ్ వరకు శనివారం కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసులకు ప్రజల సహకారం చాలా అవసరమని అన్నారు. నేరాలను అరికట్టేందుకు పోలీసులు చేపడుతున్న కార్యక్రమాలకు సహాయంగా నిలవాలని కోరారు. ఏఆర్‌ఎఫ్ అధికారి సరస్వతి, పరకాల, శాయంపేట, ఆత్మకూరు సీఐలు క్రాంతికుమార్, రంజిత్‌రావు, సంతోష్, ఎస్సైలు శివకృష్ణ, రమేష్, పరమేశ్వర్, కొంక అశోక్, తిరుపతి సిబ్బంది పాల్గొన్నారు.

నాణ్యమైన విత్తనాలు అందుబాటులో ఉంచాలి



గ్రోమోర్ సెంటర్‌లో తనిఖీలు చేస్తున్న అధికారులు

ధర్మసాగర్: వానాకాలం సీజన్ సమీపిస్తున్న తరుణంలో రైతులకు నాణ్యమైన విత్తనాలు అందుబాటులో ఉంచాలని హనుమకొండ జిల్లా వ్యవసాయ సహాయ సంచాలకుడు రాజ్ కుమార్ సూచించారు. వ్యవసాయ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మండలంలోని వివిధ విత్తన షాపుల్లో వ్యవసాయ అధికారులు, పోలీసులు కలిసి శనివారం తనిఖీలు నిర్వహించారు. ఈమేరకు షాపుల్లోని విత్తన స్టాక్ రిజిస్టర్లు, విత్తన నిల్వలు, బిల్లులు, స్టోర్స్, సర్టిఫికెట్లు, గోదాములను పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ నకిలీ విత్తనాలు అమ్మిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆధీకృత డీలర్ల వద్దనే రైతులు విత్తనాలు కొనుగోలు చేసి, తప్పనిసరిగా రసీదు తీసుకోవాలని అన్నారు. ఎవరైనా నకిలీ విత్తనాలు విక్రయిస్తున్నట్లు తెలిస్తే వెంటనే సమాచారం ఇవ్వాలని కోరారు. తనిఖీల్లో స్థానిక సీఐ ప్రవీణ్ కుమార్, ఎస్సై జానీపాషా, వ్యవసాయ అధికారులు సంతోష్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాల మెడలు వంచుదాం

- బీఆర్‌ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్



కార్మికులతో కలిసి ధర్నా చేస్తున్న వినయ్‌భాస్కర్

హన్మకొండ: ఉద్యమాల ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మెడలు వంచి, కార్మికుల హక్కులు సాధించుకుందామని బీఆర్‌ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. కార్మిక మాసోత్సవం ముగింపు సందర్భంగా హనుమకొండ బాలసముద్రంలోని ఏకశిల పార్కు వద్ద శనివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల హక్కుల సాధన కోసం బలమైన ఉద్యమాలు నిర్మించాల్సిన సమయం ఆసన్నమైందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాలుగు లేబర్ కోడ్‌లను తక్షణమే ఉపసంహరించుకోవాలని సూచించారు. కేసీఆర్ పాలనలో వీధి వ్యాపారులకు రుణాలు అందించడంతో పాటు వెండింగ్ జోన్లను ఏర్పాటు చేసినట్లు గుర్తుచేశారు. నాడు తెచ్చిన 2014 చిరు వ్యాపారుల రక్షణ చట్టాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు బొంగు అశోక్ యాదవ్, చెన్నం మధు, సంకు నర్సింగ్, సోదా కిరణ్, కార్యక్రమ కన్వీనర్ నాయిని రవి, కార్మిక నాయకులు, తెలంగాణ ఆటో యూనియన్, ప్రతాపరుద్ర ఆటో యూనియన్, భవన నిర్మాణ రంగంలోని 14 రంగాల కార్మికులు, చిరు వ్యాపారులు, తదితరులు పాల్గొన్నారు.

'ఎన్‌ఐఏ' కలకలం!

సమీర్, సిరాజ్‌తో సంబంధాలు..?

- 'వాట్సాప్' సభ్యుల పేర్లపై వివరాల సేకరణ
- వరంగల్‌లో ఒకరిని విచారించి వదిలేసిన ఎన్‌ఐఏ
- మరో ఇద్దరి కోసం ఆరా తీసి వెళ్లిన అధికారులు
- తమకేమీ తెలియదంటున్న స్థానిక పోలీసులు

సాక్షిప్రతినిధి, వరంగల్: వరంగల్‌లో జాతీయ దర్యాప్తు (ఎన్‌ఐఏ) సంస్థ ఆరా తీయడం కలకలంగా మారింది. 20 నెలల క్రితం మావోయిస్టు పార్టీ అనుబంధ సంఘాల్లో పని చేస్తున్నారంటూ పలువురి ఇళ్లపై దాడులు నిర్వహించారు. హైదరాబాద్, విజయనగరానికి చెందిన సిరాజ్ ఉర్ రెహ్మాన్, సయ్యద్ సమీర్ అరెస్టు రెండు తెలుగు రాష్ట్రాల్లో సంచలనంగా మారిన విషయం తెలిసిందే. అరెస్టుకు ముందు కొందరు యువతతో గ్రూపులు ఏర్పాటు చేసి సామాజిక మాధ్యమాల ద్వారా ఉగ్రవాదం వైపు మళ్లించారన్న ప్రచారం ఉంది. వారి వద్ద దొరికిన సమాచారం, వాట్సాప్ గ్రూపుల డేటా మేరకు తెలంగాణ, మహారాష్ట్ర తదితర ప్రాంతాల్లో పలువురి వివరాలు సేకరించినట్లు ఎన్‌ఐఏ ప్రకటించింది. ఇదే క్రమంలో తాజాగా వరంగల్, కాజీపేట, హనుమకొండ ప్రాంతాల్లో ఆరా తీశారన్న ప్రచారం చర్చనీయాంశంగా మారింది.

ట్రైసిటీలో మళ్లీ ఆరా..

సుమారు ఇరవై నెలల తర్వాత ట్రైసిటీలో ఉగ్రవాదుల ఆచూకీ పేరిట ఎన్‌ఐఏ మళ్లీ ఆరా తీయడం సంచలనంగా మారింది. అరెస్ట్ అయిన సయ్యద్ సమీర్, సిరాజ్ అనే నిందితులు ఆల్-హిందూ-ఇత్తేహదుల్ ముసల్మాన్ అనే పేరుతో 38 మంది సభ్యులతో సిగ్నల్ యాప్‌లో గ్రూప్ ఏర్పాటు చేశారు. సౌదీలో ఉంటున్న ఒకరి పర్యవేక్షణలో ఈ గ్రూపు నడిచిందన్న ప్రచారం ఉండగా.. ఏడాదిన్నరగా సౌదీకి వెళ్లి వచ్చిన పలువురు అనుమానితుల జాబితా ఎన్‌ఐఏ సేకరించినట్లు సమాచారం. వారి పేర్లు సిగ్నల్ యాప్‌లో ఉండడంతో పాటు ఆ గ్రూపులో సభ్యులై ఉండడంతో మరింత లోతుగా విచారిస్తున్నట్లు సమాచారం. ఇదే క్రమంలో వరంగల్ ములుగు రోడ్డులో నివాసం ఉండే ఒకరిని శుక్రవారం మధ్యాహ్నం అదుపులోకి తీసుకుని సాయంత్రం వరకు విచారించి వదిలి వేసినట్లు తెలిసింది. మరో ఇద్దరిని హనుమకొండ, కాజీపేట ప్రాంతాల్లో అధికారులు విచారించి వెళ్లినట్లు సమాచారం. కాగా, ఈ విషయమై స్థానిక ఓ పోలీసు ఉన్నతాధికారిని అడగ్గా తమకేమీ సమాచారం లేదని చెప్పారు.

ఆరోజు ఏం జరిగిందంటే..!

2023, అక్టోబర్ 2న ఉదయం నుంచి రాత్రి వరకు హనుమకొండలోని ప్రకాశ్‌రెడ్డిపేట, హంటర్‌రోడ్డు, పైడిపల్లిలో ఎన్‌ఐఏ తనిఖీలు నిర్వహించింది. మావోయిస్టు పార్టీకి అనుబంధ సంఘంగా ఉందని చైతన్య మహిళా సంఘం (సీఎంఎస్) మాజీ సభ్యురాలి ఇంటితో పాటు, ఆమె తల్లిగారింట్లో సోదాలు నిర్వహించారు. అలాగే, అమరవీరుల బంధుమిత్రుల కమిటీ రాష్ట్ర సభ్యురాలు ఇంట్లోనూ సోదాలు చేశారు. 2016లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన శాంతమ్మ కూతురు కొత్తకొండ సృజన అలియాస్ నవత ఫొటోలను కూడా అధికారులు పరిశీలించారు. అయితే ఆ సోదాల సందర్భంగా కూడా ఎవరినీ ఎన్‌ఐఏ అదుపులోకి తీసుకోలేదు.

డ్రెయినేజీల పరిశీలన



డ్రెయినేజీని పరిశీలిస్తున్న మేయర్ సుధారాణి, కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

న్యూశాయంపేట: నగరంలోని 28, 29వ డివిజన్ల పరిధిలోని 12 మోరీల నుంచి మేదరి బస్తీ వరకు ఉన్న డ్రెయినేజీలను కమిషనర్ అశ్విని తానాజీ వాకడేతో కలిసి నగర మేయర్ గుండు సుధారాణి క్షేత్రస్థాయిలో శనివారం పరిశీలించారు. వర్షాకాలం నేపథ్యంలో రెండు డివిజన్ల పరిధిలోని ప్రధాన నాలాతో పాటు రైల్వేట్రాక్ వైపు, మేదరి బస్తీ వద్ద ఉన్న డ్రెయినేజీల పరిస్థితిని పరిశీలించారు. సీఎంహెచ్‌ఓ డాక్టర్ రాజారెడ్డి, ఇన్‌చార్జ్ ఎస్ఈ సీపీలు రవీందర్, వాడేకర్, శ్రీనివాస్ ఎంహెచ్‌ఓ డాక్టర్ రాజేష్, ఏసీపీ శ్రీనివాస్, ఈఈ రవికుమార్, టీపీఎస్ శ్రీకాంత్, ఏఈ ముజామిల్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల పటిష్టతే టీచర్ల లక్ష్యం

- ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగిళి శ్రీపాల్‌రెడ్డి
- ముగిసిన ఉపాధ్యాయుల శిక్షణ



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ పింగిళి శ్రీపాల్‌రెడ్డి

విద్యారణ్యపురి: ప్రభుత్వ పాఠశాలల పటిష్టతే ఉపాధ్యాయుల లక్ష్యం కావాలని, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు కృషి చేయాలని ఉమ్మడి వరంగల్, నల్లగొండ, ఖమ్మం జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగిళి శ్రీపాల్‌రెడ్డి కోరారు. హనుమకొండ జిల్లాలో స్కిల్‌స్టార్క్ స్కూల్‌లో ఐదు రోజులుగా కొనసాగుతున్న ఉపాధ్యాయుల మూడో విడత శిక్షణ కార్యక్రమం శనివారం ముగిసింది. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొని మాట్లాడారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమంలో నేర్చుకున్న అంశాలను తరగతి గదుల్లో అమలు చేయాలని సూచించారు. జిల్లా క్వాలిటీ కోఆర్డినేటర్ శ్రీనివాస్, యాంటీ నార్కొటిక్స్ బ్యూరో ఎస్సై ఎం.రాజు, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ ఎస్సై పిలిప్స్‌రాజు, షీటీమ్స్ ఎస్సై విద్యాసాగర్, సైబర్ క్రైమ్స్ ఎస్సై శివకుమార్ మాట్లాడారు. శిక్షణ కేంద్రం ఇన్‌చార్జ్‌లు విజయ్ మోహన్, మధుసూదన్ రెడ్డి, డీఆర్‌పీలు శానుగుల భద్రయ్య, జీవీ.ప్రసాద్, అజయ్, అలీ, శశికళాధర్, శివకుమార్, సంపత్, శ్రీను, విద్యానంద్, అట్ల రవి, సీఆర్‌పీ రఘు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముగిసిన టీచర్ల శిక్షణ

హనుమకొండ జిల్లాలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్, కేజీబీవీలు, మోడల్ స్కూళ్లు, టీజీఆర్‌ఈఐఎస్ ఉపాధ్యాయులు, ఉమ్మడి జిల్లాలోని ఉర్దూమీడియం పాఠశాలల ఉపాధ్యాయులకు మే 13నుంచి 31వ తేదీ వరకు మూడు దశల్లో సుమారు 2,700 మందికి శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులకు నైపుణ్యాలు, అభ్యసనాల అభివృద్ధి వంటి అనేక అంశాలపై శిక్షణ ఇచ్చారు.

క్లుప్తంగా

గర్భిణిపై దాడి.. బంగారం అపహరణ

● వంగపల్లిలో ఘటన

కమలాపూర్: అక్రమంగా ఇంట్లోకి చొరబడి ఏడు నెలల గర్భిణీపై దాడికి పాల్పడి ఆమె మెడలోని 3 తులాల బంగారు పుస్తెల తాడు అపహరించుకెళ్లిన ఘటన హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం వంగపల్లిలో చోటు చేసుకుంది. పోలీసులు, గ్రామస్తుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన ఎలుకటి రాజయ్య కూతురు దివ్యను హసన్‌పర్తి మండలం నాగారం గ్రామానికి చెందిన వ్యక్తికి ఇచ్చి వివాహం చేశారు. దివ్య ప్రస్తుతం ఏడు నెలల గర్భిణీ. ఈ క్రమంలో ఇటీవల వంగపల్లిలోని తన తల్లిగారి ఇంటికి వచ్చింది. శుక్రవారం ఒంటరిగా నిద్రిస్తుండగా అదే గ్రామానికి చెందిన చిలువేరు ప్రశాంత్ ఇంట్లోకి అక్రమంగా ప్రవేశించాడు. గమనించిన దివ్య కేకలు వేయడంతో ఆమె ముఖంపై దిండు పెట్టి పక్కనే ఉన్న స్టీల్ రాడ్‌తో తలపై కొట్టి ఆమె మెడలో ఉన్న 3 తులాల బంగారు పుస్తెల తాడు ఎత్తుకెళ్లాడు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన దివ్యను స్థానికులు వెంటనే చికిత్స నిమిత్తం వరంగల్ ఎంజీఎం తరలించారు. దివ్య సోదరుడు ఎలుకటి దిలీప్ ఫిర్యాదు మేరకు ప్రశాంత్‌పై శుక్రవారం రాత్రి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ హరికృష్ణ తెలిపారు.

ఓహెచ్‌సీ వైరులో సాంకేతిక లోపం..

● డోర్నకల్‌లో నిలిచిన కృష్ణా, జనతా ఎక్స్‌ప్రెస్‌లు

డోర్నకల్: ఓహెచ్‌సీ వైరులో సాంకేతిక లోపం తలెత్తడంతో శనివారం డోర్నకల్ రైల్వే స్టేషన్‌లో కృష్ణా, జనతా ఎక్స్‌ప్రెస్ రైళ్లు నిలిచాయి. డోర్నకల్, గార్ల మార్గంలో 90 ఎల్‌సీ గేట్ సమీపంలో సీతారామ ప్రాజెక్ట్ పనుల్లో భాగంగా బ్లాస్టింగ్ నిర్వహించారు. ఈ సమయంలో ఓ రాయి రైల్వే ట్రాక్ వైపు వచ్చి ఓహెచ్‌సీ వైరుకు తగలడంతో ఇన్సులేటర్ ఊడింది. గమనించిన గేట్‌మెన్ డోర్నకల్ రైల్వే స్టేషన్‌కు సమాచారం అదించడంతో ఓహెచ్‌సీ సిబ్బంది హుటాహుటిన ఘటనా స్థలికి చేరుకుని మరమ్మతులు చేశారు. దీంతో వరంగల్ వైపునకు వెళ్తున్న కృష్ణా ఎక్స్‌ప్రెస్ గంట పాటు స్టేషన్‌లో నిలవగా జనతా ఎక్స్‌ప్రెస్ హోం సిగ్నల్‌పై 45నిమిషాలు నిలిచింది.



పొదుపు.. భవిష్యత్‌కు మలుపు

'స్వావలంబన్ యోజనతో' వృద్ధాప్యంలో ఆర్థిక అండ

● 18 నుంచి 60 ఏళ్ల వారు అర్హులు
● కేంద్ర ప్రభుత్వ పథకంతో భవిష్యత్‌కు ఆర్థిక ధీమా

సాక్షి మీ కోసం

నేషనల్ పెన్షన్ సిస్టమ్(ఎన్‌పీఎస్)లో భాగంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'స్వావలంబన్ యోజన పథకం' వృద్ధాప్యంలో ఆర్థికంగా అండగా నిలవనుంది. ప్రభుత్వ ఉద్యోగుల మాదిరి దేశంలోని సామాన్యులు సైతం 60 ఏళ్లు నిండిన తర్వాత పెన్షన్ పొందేందుకు కేంద్రం ఈ అవకాశం కల్పించింది. బడుగు, బలహీన వర్గాల వారితోపాటు, కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీలు, ఆటో, ట్యాక్సీ, లారీ డ్రైవర్లు, ఇతర ప్రైవేట్ ఉద్యోగులు, చిన్న,పెద్ద వ్యాపారులు ఈ పథకాన్ని ఉపయోగించుకోవచ్చు. వయసులో చేసిన పొదుపు.. వృద్ధాప్యంలో అండగా నిలవనుంది.



స్వావలంబన్ యోజన విశిష్టత..

ప్రభుత్వ ఉద్యోగులకు కాకుండా దేశంలోని సామాన్యులు కూడా 60 ఏళ్ల తర్వాత వృద్ధాప్యంలో పెన్షన్ పొందేందుకు కేంద్రప్రభుత్వం అవకాశం కల్పించింది. ఆర్థిక భద్రత కల్పించడమే లక్ష్యంగా 2009లో 'జాతీయ పెన్షన్ స్వావలంబన్ యోజన పథకం'ను ప్రారంభించింది.

కాజీపేట: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నేషనల్ పెన్షన్ సిస్టమ్ (ఎన్‌పీఎస్)ను గతంలో కేవలం ప్రభుత్వ ఉద్యోగులకే అనుకునేవారు. ప్రస్తుతం కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన 'నేషనల్ పెన్షన్ సిస్టమ్ స్వావలంబన్ పథకం'కు గృహిణి నుంచి కూలీ పని చేసుకునే ప్రతి ఒక్కరూ అర్హులు. ఈ పథకంలో చేరడం వల్ల వృద్ధాప్యంలో పెన్షన్ పొందే అవకాశం ఉంది. ప్రస్తుత రోజువారీ ఖర్చులను అధిగమించడం కష్టంగా ఉంది. ఈ నేపథ్యంలో సంపాదించే వయసులోనే ఎలాంటి పొదుపు చేకుండా ఉంటే వృద్ధాప్యంలో ఆర్థిక పరిస్థితి ఎంత దారుణంగా ఉంటుందో ఊహించుకోవచ్చు. ఎంతో మంది వృద్ధ తల్లిదండ్రులను జీవిత చరమాంకంలో కొడుకులు పట్టించుకోకపోవడం ప్రస్తుతం చూస్తున్నాం. ఆసరా కరువై.. పనిచేసే శక్తిలేక.. ఆర్థిక అండ కరువై ఎంతోమంది వృద్ధులు దుర్భరంగా బతుకుతున్నారు. వయసు పెరగడంతో పాటు జీవన వ్యయాలు కూడా పెరుగుతున్నాయి. ఈ సమస్య నుంచి గట్టెక్కాలంటే ఆర్థికంగా స్వాతంత్ర్యం ఉండాలి. అందుకే 'స్వావలంబన్' యోజన పథకంలో చేరితే చక్కటి ఫలితంగా ఉంటుంది. వయసులో ఉన్న సమయంలో చేసిన పొదుపు.. వృద్ధాప్యంలో ఎవరిపైనా ఆధారపడకుండా గౌరవంగా జీవించేందుకు అవకాశం కల్పిస్తుంది.

స్వావలంబన్‌తో ప్రయోజనాలు..

వృద్ధాప్యంలో పింఛన్ అందజేయడమే ఈ పథకం ముఖ్య ఉద్దేశం. 18 నుంచి 60 ఏళ్ల వయసున్న భారతీయ పౌరులందరూ ఈ ఖాతాను తెరిచేందుకు అర్హులు. ప్రతీ పౌరుడు ఏడాదిలో కనీసం రూ.వెయ్యి నుంచి రూ. 2వేలకు తగ్గకుండా పొదుపు చేయాలి. ప్రభుత్వం ఏటా రూ.600 కలుపుతుంది. ప్రతీ ఖాతాదారుడికి ఫొటోతో పాటు పాన్‌కార్డు (పర్మినెంట్ రిటైర్‌మెంట్ అకౌంట్ నంబర్)ను ఇస్తుంది. ఈ కార్డుతో ఎన్‌పీఎస్‌లో సభ్యత్వం ఉన్నట్లు గుర్తించొచ్చు. ఖాతా తెరిచిన 45 రోజుల్లో ఈ కార్డును పొందొచ్చు.

పింఛన్ ఇలా పొందుతారు..

ఖాతాదారుడి వయస్సు 60 ఏళ్ల నిండిన వెంటనే తాము జమచేసిన డబ్బు మొత్తం 60 శాతం నగదును ఒకేమారు చెల్లిస్తారు. మిగతా 40శాతం వారి ఖాతాలో అలాగే ఉంచి, దానిపై వచ్చే రాబడిని జీవితాంతం ప్రతీనెలా పింఛన్ రూపంలో చెల్లిస్తారు. ఖాతాదారుడు మరణిస్తే అప్పటివరకు ఖాతాలో పొదుపు చేసిన మొత్తం నిధిని వారి నామినీకి అందిస్తారు. 60 ఏళ్ల తర్వాత పింఛన్ పొందుతున్న వ్యక్తి మరణిస్తే ఖాతాలో నిల్వ ఉన్న 40శాతం సొమ్మును కూడా వారికే అందజేస్తారు. ఈ పథకాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడానికి మండల స్థాయి కోఆర్డినేటర్లను నియమించినా ఆశించిన ఫలితాలు రావడంలేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఎంతో ప్రయోజనకరంగా ఉన్న ఈ పథకానికి సరైన ప్రచారం చేస్తే మరింత ఉపయోగం ఉంటుంది. టోల్‌ఫ్రీ నంబర్ 1800–110708కు ఫోన్‌చేసి పూర్తి వివరాలు తెలుసుకోవచ్చు.

సమన్వయంతోనే పుష్కరాలు సక్సెస్



పుష్కరాల్లో విధులు నిర్వర్తించిన జిల్లా అధికారులతో మంత్రి శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యే గండ్ర, కలెక్టర్, ఎస్పీ

● అటెండర్ నుంచి రాష్ట్రస్థాయి అధికారి వరకు మూడు నెలలు శ్రమించారు
● పుష్కరాలు విజయవంతం కావొద్దని కొందరు కుట్రలు పన్నారు
● రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

భూపాలపల్లి: అధికారులు, ప్రజల సమన్వయంతోనే సరస్వతీనది పుష్కరాలు విజయవంతమయ్యాయని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని పుష్ప గ్రాండ్‌లో కలెక్టర్ రాహుల్ శర్మ అధ్యక్షతన నిర్వహించిన 'సరస్వతి పుష్కరాలు ఎ డే ఆఫ్ థాంక్స్' కార్యక్రమానికి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావుతో కలిసి మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ కిరణ్ ఖరే మార్గనిర్దేశంలో 33 శాఖలకు చెందిన అటెండర్ నుంచి జిల్లా, రాష్ట్ర స్థాయి అధికారి వరకు ప్రతి ఒక్కరూ మూడు నెలలు కష్టపడ్డారన్నారు. పుష్కరాల విజయవంతంలో వారి పాత్ర కీలకమని, వారందరికీ అభినందనలు తెలిపారు. పుష్కరాల నిర్వహణ అంత తేలిక కాదని, ఏ చిన్న పొరపాటు జరిగినా, నిర్లక్ష్యంగా ఉన్నా జరిగే నష్టం అంతా ఇంతా కాదన్నారు. కొందరు సరస్వతీనది పుష్కరాలు విజయవంతం కాకుండా చేయాలని కుట్రలు పన్నారని, చిన్న అంశాలను భూతద్దంలో చూపించి తమను బద్నాం చేసేందుకు యత్నించారన్నారు. త్వరలోనే కాళేశ్వరం జాతీయ రహదారిని నాలుగు లేన్లుగా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటామని, కాళేశ్వరం, ఇతర ప్రాంతాల్లో కొత్త బస్‌డిపోల నిర్మాణానికి శ్రీకారం చుడుతామన్నారు. 2027లో జరుగనున్న గోదావరి పుష్కరాలను మరింత వైభవోపేతంగా నిర్వహిస్తామని వెల్లడించారు. అనంతరం ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు మాట్లాడుతూ రాష్ట్ర మంత్రి శ్రీధర్‌బాబు, దేవాదాయ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజారామయ్యర్ ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహించి పుష్కరాల విజయవంతానికి కృషి చేశారన్నారు. పుష్కరాలకు వస్తూ రోడ్డు ప్రమాదాలకు గురై చనిపోయిన వారిని ప్రభుత్వపరంగా ఆదుకోవాలన్నారు. అనంతరం పుష్కరాల్లో సమర్థవంతంగా విధులు నిర్వర్తించిన పలు శాఖల అధికారులకు ప్రశంస పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఎస్పీ కిరణ్ ఖరే, రాష్ట్ర ట్రేడ్ కార్పొరేషన్ చైర్మన్ ప్రకాశ్‌రెడ్డి, అదనపు కలెక్టర్లు అశోక్‌కుమార్, విజయలక్ష్మి, సింగరేణి భూపాలపల్లి ఏరియా జీఎం రాజేశ్వర్‌రెడ్డి, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

'పుష్కరాల' చెత్త తొలగింపు ఏదీ!



త్రివేణి సంగమం వద్ద వ్యర్థాలు తింటున్న ఎద్దు

కాళేశ్వరం: గత నెల 15 నుంచి 26వ తేదీ వరకు అత్యంత వైభవంగా జరిగిన సరస్వతీనది పుష్కరాల్లో చెత్త తొలగింపుపై పంచాయతీ అధికారులు నిర్లక్ష్యం వీడడం లేదు. గోదావరిలోని ఖాళీ వాటర్ బాటిళ్లు, వ్యర్థాలు తొలగించడం లేదు. దీంతో పశువులు అందులోని వ్యర్థాలు, ప్లాస్టిక్‌ను తింటున్నా యి. ఫలితంగా పశువులు అనారోగ్యం బారిన పడే అవకాశం ఉందని పలువురు పేర్కొంటున్నారు. ఇదే కాకుండా అన్నదానసత్రాలు, హోటళ్లు, ఇతర వ్యాపారాలు నిర్వహించిన ప్రాంతాల్లో వ్యర్థాలు కుళ్లి తీవ్ర దుర్గంధం వెదజల్లుతోంది. దీంతో వర్షాకాలంలో దోమలు వ్యాప్తి చెంది, సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. దీనిపై ఇప్పటికైనా అధి కారులు స్పందించి దోమలు వ్యాప్తి చెందకుండా చెత్తను తొలగించి, అన్ని వార్డుల్లో రెండు రోజులకు ఒక్కసారి వారం పాటు బ్లీచింగ్ పౌడర్ చల్లాలని గ్రామస్తులు పేర్కొంటున్నారు. పారిశుద్ధ్యంపై తక్షణ చర్యలు తీసుకుని దుర్గంధం వెదజల్లకుండా చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు.

మేడారం ఈఓగా వీరస్వామి



ఈఓ వీరస్వామిని సన్మానిస్తున్న సహాయ కమిషనర్ రాముల సునీత

హన్మకొండ కల్చరల్: మేడారం సమ్మక్క, సారలమ్మ జాతర ఈఓగా మేకల వీరస్వామి బాధ్యతలు స్వీకరించారు. దేవాదాయ, ధర్మదాయ శాఖ అధికారులు ఉత్తర్వులు మేరకు శనివారం వరంగల్‌లోని ధర్మిక భవన్‌లోని మేడారం సమ్మక్క , సారలమ్మ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఈఓ మేకల వీరస్వామికి వరంగల్ జిల్లా దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ రామల సునీత, తెలంగాణ అర్చక ఉద్యోగ జాక్ చైర్మన్ గంగు ఉపేంద్ర శర్మ శుభాకాంక్షలు తెలిపారు. అలాగే, ఉద్యోగ విరమణ పొందిన మేడారం సమ్మక్క, సారలమ్మ జాతర ఈఓ రాజేంద్రం , మరో ఆలయ ఈఓ వేణుగోపాల్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అర్చక సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తనుగుల రత్నాకర్, ఈఓలు అద్దంకి నాగేశ్వరరావు, వెంకటయ్య, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు

ఉచిత శిక్షణ విద్యార్థులకు ప్రయోజనం

విద్యారణ్యపురి : యూనివర్సిటీల్లో ఎమ్మెస్సీ కెమిస్ట్రీలో ప్రవేశాలకు పీజీ ప్రవేశపరీక్ష కోసం డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థులకు ఉచితంగా ఆన్‌లైన్‌లో శిక్షణ ఇవ్వటం అభినందనీయమని కళాశాల విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ బాల భాస్కర్ అన్నారు. హనుమకొండలోని కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో ఎమ్మెస్సీ కెమిస్ట్రీ ఎంట్రెన్స్ పరీక్ష కోసం 30 రోజులుగా ఆన్‌లైన్‌లో విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నారు. శిక్షణ ముగింపు సమావేశంలో ఆయన ఆన్‌లైన్ ద్వారా మాట్లాడారు. ఈసారి కూడా శిక్షణ పొందిన విద్యార్థులు కూడా సీట్లు సాధించాలని ఆయన ఆకాంక్షించారు. సమావేశంలో రాజేంద్రసింగ్, డాక్టర్ వాసం శ్రీనివాస్, డాక్టర్ బి. చంద్రమౌళి, డాక్టర్ బి.రమేష్, సురేందర్, సోమిరెడ్డి, శ్రీనాథ్ పాల్గొన్నారు.

సౌర విద్యుత్‌కు ప్రోత్సాహం..

గృహ వినియోగదారులకు రాయితీపై సోలార్ ప్లాంట్

● ఇంటి పైకప్పుపై ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వ ప్రోత్సాహం
● పీఎం సూర్యఘర్ పథకం ద్వారా సబ్సిడీ
● టీజీఎన్పీడీసీఎల్‌లో ఇప్పటి వరకు 3,925 మంది వినియోగదారులు సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేసుకున్నారు
● మార్చి 2027 వరకు దేశంలో కోటి ఇళ్లలో సోలార్ విద్యుత్ ఉత్పత్తి లక్ష్యం



హన్మకొండ: దేశంలో సౌర విద్యుత్ ఉత్పత్తిని ప్రోత్సహించడంతోపాటు నివాస గృహాలు తమ సొంత విద్యుత్‌ను ఉత్పత్తి చేసుకునేందుకు కేంద్ర ప్రభుత్వం 'సూర్యఘర్ ముఫ్త్ బిజిలి యోజన పథకం' తీసుకొచ్చింది. రూ.75,021 కోట్లతో చేపట్టిన ఈ పథకాన్ని 2026–2027 ఆర్థిక సంవత్సరం వరకు అమలు చేయనుంది. ఈ నేపథ్యంలో ఆయా రాష్ట్రాల్లోని విద్యుత్ పంపిణీ సంస్థలు తమ పరిధిలో ఇళ్ల పైకప్పుపై సౌర విద్యుత్ ఉత్పత్తి సాధించేందుకు కృషి చేస్తున్నాయి. విద్యుత్ వినియోగదారులు సౌరశక్తిని ఉత్పత్తి చేసేందుకు అవసరమైన సాయం అందజేస్తున్నాయి. ఇందులో భాగంగా నెట్ మీటర్ల ఏర్పాటు, ఇన్‌స్టాలేషన్‌ను సులభతరం చేశాయి. టీజీ ఎన్పీడీసీఎల్ పరిధిలోని 16 సర్కిళ్లలో ఇప్పటి వరకు 3,925 మంది విద్యుత్ వినియోగదారులు 14,014.77 కిలో వాట్ల సామర్థ్యం కలిగిన సోలార్ ప్యానళ్లను ఏర్పాటు చేసుకున్నారు. వీటి ద్వారా 14 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నారు. ఇంటిపై కప్పుపై ఏర్పాటు చేసిన సోలార్ ప్లాంట్ ద్వారా ఉత్పత్తి అయిన విద్యుత్‌ను గృహ అవసరాలకు వినియోగించుకుకోవడం ద్వారా విద్యుత్ బిల్లుల భారం నుంచి విముక్తి పొందడంతో పాటు మిగులు విద్యుత్‌ను ప్రభుత్వానికి (డిస్కంలకు) విక్రయించి ఆదాయం పొందొచ్చు. సంప్రదాయ విద్యుత్ వనరులపై ఆధారపడడాన్ని తగ్గించడం, పర్యావరణ హిత విద్యుత్‌ను ప్రోత్సహించడం కోసం కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రవేశపెట్టింది.

రాయితీ మూడు కిలో వాట్ల వరకు పరిమితం

ఈ పథకంలో 2 కిలో వాట్ల సామర్థ్యం కలిగిన సోలార్ ప్యానళ్ల ఏర్పాటుకు యూనిట్ ఖర్చులో 60 శాతం, 2 నుంచి 3 కిలోవాట్ల సామర్థ్యం కలిగిన ప్లాంట్ ఏర్పాటుకు 40 శాతం రాయితీ అందిస్తున్నారు. 3 కిలో వాట్ల సామర్థ్యం తర్వాత ఎలాంటి రాయితీ లేదు. రాయితీ మూడు కిలో వాట్ల వరకు పరిమితం చేశారు. ప్రస్తుతమున్న ధరల ప్రకారం కిలో వాట్ విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం ఉన్న సోలార్ యూనిట్ ఏర్పాటుకు రూ.85,550 అవుతుంది. ఇందులో ప్రభుత్వం రూ.30 వేల రాయితీ అందిస్తుండగా, వినియోగదారుడు 55,500 చెల్లించాలి. 2 కిలో వాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం కలిగిన సోలార్ ప్లాంట్ ఏర్పాటునకు రూ.1,46,500 ఖర్చు అవుతుంది. 3 కిలో వాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం కలిగిన సోలార్ ప్లాంట్ ఏర్పాటునకు రూ.2,08,900 ఖర్చు అవుతుంది. 2 కిలో వాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం కలిగిన ప్లాంట్‌కు ప్రభుత్వం రూ.60 వేల రాయితీ అందిస్తుంది. వినియోగదారులు రూ.86 వేలు భరించాలి. మూడు కిలోవాట్ల విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్‌కు ప్రభుత్వం రూ.78 వేల రాయితీ అందిస్తుండగా, వినియోగదారుడు రూ.1,30, 900 భరించాలి. మూడు కిలో వాట్ల పైగా సోలార్ ఉత్పత్తి యూనిట్ ఏర్పాటు చేసుకునే వారికి రూ.78 వేల రాయితీ అందిస్తుంది. మిగతా ఖర్చులు వినియోగదారులు భరించాల్సి ఉంటుంది. విద్యుత్ కనెక్షన్ కలిగి ఉన్న ప్రతీ వినియోగదారుడు ఈ సోలార్ యూనిట్‌ను ఏర్పాటు చేసుకోవచ్చు. ఇంటిపై కప్పు సోలార్ ప్యానళ్ల ఏర్పాటుకు అనుకూలంగా ఉండాలి. కిలోవాట్ సోలార్ యూనిట్ ఏర్పాటు ద్వారా నాలుగున్నర యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతుంది. మూడు కిలో వాట్ల సోలార్ ప్యానళ్ల ద్వారా 15 యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతుంది. మిగులు విద్యుత్‌ను డిస్కంలకు విక్రయించడం ద్వారా యూనిట్‌కు రూ.5.25 చొప్పున ఆదాయాన్ని పొందొచ్చు.

సర్కిళ్ల వారీగా ఇలా..

టీజీ ఎన్పీడీసీఎల్ పరిధిలో ఆదిలాబాద్ సర్కిల్‌లో 331 మంది వినియోగదారులు 1191.67 కిలో వాట్ల సామర్థ్యమున్న సోలార్ యూనిట్లు ఏర్పాటు చేసుకున్నారు. ఆసిఫాబాద్‌లో 21 మంది 75 కిలో వాట్లు, భూపాలపల్లిలో 19 మంది 62 కిలో వాట్లు, హనుమకొండలో 622 మంది 2123.8 కిలో వాట్లు, జగిత్యాలలో 65 మంది 238 కిలో వాట్లు, కామారెడ్డిలో 65 మంది 240.95 కిలో వాట్లు, కరీంనగర్‌లో 491 మంది 1840.23 కిలో వాట్లు, ఖమ్మంలో 715 మంది 2544.66 కిలో వాట్లు, కొత్తగూడెంలో 441 మంది 1582.82 కిలో వాట్లు, మహబూబాబాద్‌లో 81 మంది 289.5 కిలో వాట్లు, మంచిర్యాలలో 137 మంది 434.45 కిల వాట్లు, నిర్మల్‌లో 79 మంది 270.5 కిలో వాట్లు, నిజామాబాద్‌లో 486 మంది 1795.99 కిలో వాట్లు, పెద్దపల్లిలో 108 మంది 390.3 కిలో వాట్లు, వరంగల్ సర్కిల్‌లో 219 మంది వినియోగదారులు 791.9 కిలో వాట్ల సామర్థ్యం ఉన్న సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేశారు.

పీఎం సూర్యఘర్ ముఫ్త్ బిజిలి యోజనతో ప్రయోజనాలు



పీఎం సూర్యఘర్ ముఫ్త్ బిజిలి యోజనతో విద్యుత్ వినియోగదారులతో అనేక ప్రయోజనాలున్నాయి. పర్యావరణహిత విద్యుత్ ఉత్పత్తి చేయడం ద్వారా భవిష్యత్‌కు మేలు చేసినట్లు అవుతుంది. ప్రధానంగా కార్బన్ ఉద్గారాలు తగ్గుతాయి. విద్యుత్ బిల్లుల బాధ తప్పుతుంది. ప్రభుత్వం రాయితీ ఇస్తున్న నేపథ్యంలో సోలార్ ప్యానళ్ల ఏర్పాటు ఖర్చు తక్కువవుతుంది.

కె.గౌతం రెడ్డి, ఎస్ఈ, వరంగల్

సోలార్ ప్యానెళ్లు సూర్యశక్తిని నేరుగా విద్యుత్ శక్తిగా మారుస్తాయి



సోలార్ ప్యానళ్ల సూర్యశక్తిని నేరుగా విద్యుత్ శక్తిగా మారుస్తాయి. సౌర ఫలకాలు ఫొటోవోల్టాయిక్ ప్రభావం ద్వారా సూర్యరశ్మిని నేరుగా విద్యుత్‌గా మారుస్తాయి. సోలార్ ప్యానళ్లను ఇంటి పైకప్పుపై బిగించుకుని సులువుగా విద్యుత్ ఉత్పత్తి చేసుకోవచ్చు. ఆ విద్యుత్‌ను ఇంటి అవసరాలకు వాడుకోవడంతో పాటు మిగులు విద్యుత్ డిస్కంలకు విక్రయించడం ద్వారా ఆదాయం పొందొచ్చు.

పి.మధుసూదన్‌రావు, ఎస్ఈ , హనుమకొండ

సమాజం అండదండలతోనే 'పద్మశ్రీ'

● వర్గీకరణ స్వప్నం సాకారమమడం ఉద్యమ విజయం
● ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ




మందకృష్ణ మాదిగ దంపతులను సన్మానిస్తున్న నేతలు, సమావేశానికి హాజరైన నాయకులు, కార్యకర్తలు

హన్మకొండ అర్బన్ : సమాజం అండదండలతోనే తనకు 'పద్మశ్రీ' అవార్డు లభించిందని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ అన్నారు. భారత రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము చేతుల మీదుగా పద్మశ్రీ పురస్కారం అందుకున్న అనంతరం శనివారం వరంగల్ చేరుకున్నారు. రైల్వేస్టేషన్‌లో ఎమ్మార్పీస్ శ్రేణులు, ఇతర సంఘాల నాయకులు మంద కృష్ణ దంపతులను భారీ గజమాలతో సన్మానించారు. ఈ సందర్భంగా వరంగల్ రైల్వే స్టేషన్‌లో, రాత్రి హనుమకొండలోని కాళోజీ కళాక్షేత్రంలో పద్మశ్రీ మంద కృష్ణమాదిగ మాట్లాడారు. ఈ సంవత్సరంలో ఎమ్మార్పీఎస్ పోరాట ఫలితంగా వర్గీకరణ సాధించడం, తనకు పద్మశ్రీ పురస్కారం రావడం మాదిగజాతికి గర్వకారణమన్నారు. ఈ గౌరవం తనకు మాత్రమే కాకుండా తనకు ఉద్యమంలో అన్ని విధాలా సహకరించిన సమాజానికి కూడా అన్నారు. మూడు దశాబ్దాల ఉద్యమ పోరాటంలో అనేక ఒడిదొడుకులు ఎదురైనా ధైర్యంగా బరిలో నిలిచి లక్ష్యం సాధించామన్నారు.

ప్రధాని, ముఖ్యమంత్రులకు కృతజ్ఞతలు ..

వర్గీకరణ విషయంలో ముందుండి నడిపిన ప్రధాని మోదీ, సహకరించిన తెలంగాణ, ఏపీ ముఖ్యమంత్రులు రేవంత్‌రెడ్డి, చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. ఇది మాదిగ జాతి ఉద్యమ విజయానికి నిదర్శమన్నారు. సమాజంలోని అన్ని వర్గాలను కలుపుకునిపోతూ వర్గీకరణ సాధించామన్నారు. ఈక్రమంలో అనేక వర్గాలు సహకరించాయన్నారు. రానున్న రోజుల్లో వారి అభ్యున్నతికి కృషి చేస్తామన్నారు.

కాళోజీ కళాక్షేత్రంలో జాతీయ కార్యవర్గ సమావేశం..

వరంగల్ రైల్వేస్టేషన్ నుంచి సుమారు 11గంటల ప్రాంతంలో హనుమకొండలోని కాళోజీ కళాక్షేత్రానికి చేరుకున్నారు. తెలంగాణ, ఏపీ ఎమ్మార్పీస్ నేతలు, ఇతర ప్రజాసంఘాల ఆధ్వర్యంలో పద్మశ్రీ మందకృష్ణను సన్మానించారు. అనంతరం ఎమ్మార్పీఎస్ జాతీయ కార్యవర్గ సమావేశంలో మందకృష్ణను అభినందిస్తూ తీర్మానంచేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మున్నంగి నాగరాజు మాదిగ, తెలంగాణ, ఏపీ రాష్ట్రాల అధ్యక్షులు గోవిందు నరేశ్ మాదిగ, రుద్రపోగు సురేశ్ మాదిగ, జాతీయ నేత మంద కుమార్ మాదిగ, బొడ్డు దయాకర్, నరేంద్ర, బొర్ర భిక్షపతి, బుర్రి సతీశ్, రవి, గద్దల సుకుమార్, బందారు సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

మంద కృష్ణమాదిగకు ఘన స్వాగతం

ఖిలా వరంగల్ : పద్మశ్రీ అవార్డు గ్రహీత, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగకు వరంగల్‌లో ఘనస్వాగతం పలికారు. మంగళవారం ఢిల్లీలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము చేతులమీదుగా పద్మశ్రీ అవార్డు అందుకున్న ఆయన శనివారం రాత్రి ఏపీ ఎక్స్‌ప్రెస్ రైలులో వరంగల్ వచ్చారు. రైల్వేస్టేషన్‌లో దిగిన ఆయనకు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పుష్పగుచ్ఛాలు అందించి ఘనస్వాగతం పలికారు. అనంతరం డప్పుచప్పుళ్లు, డీజే మోతలతో రైల్వేస్టేషన్ నుంచి హనుమకొండలోని కాళోజీ కళాక్షేత్రం వరకు ర్యాలీగా చేరుకున్నారు.

WANTED

Invites Applications for the post of
PRINCIPAL
INDUSTRIAL TRAINING INSTITUTE (I.T.I)
Employment : Full-Time / Contractual

- Degree or Diploma in Engineering / Technology with minimum 8 years in technical/vocational education and administration.
- Age : 38 and above
- Prior role as Vice Principal, Sr. Instructor, or HoD desirable.
- Retired professionals may also apply (as per Govt. norms).
- Strong leadership, administrative and digital skills essential

Send your detailed CV with a cover letter to: premsg123@gmail.com
For details contact: 07799038566 / 09441129072
FATIMA I.T.I, Kazipet, Telangana-506004.

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

TO-LET
■ G+1 Shutter for Rent Dolphin Kids Hospital Lane Opp Kasam Brothers Chourastha, Hanamkonda. Cell: 8143528262. [SCA25004368]

PLOT FOR SALE
■ మడికొండ to రాంపూర్ Hyd హైవే కిటిల్‌ఫుడ్స్ ఎదురుగా 1210 గ॥ రిజిస్టర్ మరియు నాలా కన్వర్షేషన్ గల ప్లాటు అమ్మబడును. సంప్ర॥ 9346434041. [WA-4104]

■ KU దబ్బాలు కెనాల్ నుండి 900 మీ॥దూ॥లో 80 ఫీ॥ రోడ్డు ప్లాట్స్ నాలా పర్మిషన్ విత్ రిజిస్ట్రేషన్ ప్లాట్స్, రెసిడెన్షియల్ జోన్, లోన్ సౌకర్యం, గ॥ రూ॥12000. 9182538110, 8341175144. [WA-7567]

FLAT FOR SALE
■ 3BHK FLAT, 1st ఫ్లోర్, 1478 Sft అక్షర స్కూల్ ప్రక్కన, భవాని నగర్ (డీజిల్ కాలని) కాజీపేట Hyd రోడ్డు అతి సమీపంలో FLAT అమ్మకానికి కలదు. సం.ప్ర. 80554 54805 [M-13536]

SERVICES
■ హౌస్, ప్లాట్, వ్యవసాయ భూములు మార్టిగేజ్ చేసుకొని అమౌంట్ ఇప్పించబడును. సిబిల్ అవసరం లేదు. సెల్: 7842279342. [WA-7566]

రెస్టారెంట్స్
■ హోటల్ విహార గ్రాండ్ NGO's కాలనీ రోడ్, హన్మకొండ, టిఫిన్స్, రెస్టారెంట్, ఐస్ క్రీమ్స్, లగ్జరి రూమ్స్. సంప్ర: 9966600413, 9966600418 [SCA25004322]

BUSINESS OFFER
■ Need Monthly Returns? Get International Capital Market Trading, Profit Sharing/Fixed Profit Safe & Secure. Ph : 9392151984 [SCA25004324]

WANTED
■ Wanted Lady Principal with B.Ed and pre-primary and 1st to 7th class all sub teachers part time teachers for 9th, 10th Master's High School Fort Warangal. Cell: 8790720106, 9347903778. [SCA25004435]

■ రత్నశ్రీ ఫర్నీచర్ చూసుకోవడానికి లేడీస్ కావలెను. టైం 10am to 7.30pm ఇంటర్వ్యూ 02-06-25 సోమవారం 11am D Mart కుడి ప్రక్కన Wgl. 8106683662. [SCA25004436]

■ Wanted telecallers in Education sector, Salary 10,000/-. Full Time & Part Time, 5,000/- Incentive are 10,000/- per Admission. Cont: 9908432153 & 9517961999 [WA-6590]

■ Wanted 10 security Guards for reputed company. For more details Con: Aptivine Vertex Con.pvt ltd, Ph:95336 80353, 94412 39257 [M 13526]

■ Interested candidates having banking experience including Retired Bank staff may apply to working Bhadradri Co-operative Urban Bank Ltd., Khammam. For details refer website www.bhadradribank.com, Last Date: 15-06-2025. Contact: 96033 66343 [M 13471]

■ రామకృష్ణ ఓల్డేజ్ హోం TG No.1 Hyd శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల/పేషెంట్ల సేవకు వంట/ఇంటి పనిబేబికేర్‌కు M/F వర్కర్స్ కా॥భో+వసతి+జీతం 16-18 వేలు ఫోన్: 9133271122/ 9515119430 [SCA25004282]

■ Hanamkonda A/C Hotel Waiters పనిచేయుటకు M/F కావలెను & ఆఫీస్‌లో స్టాఫ్ కావలెను. ఫోన్: 9848073605 [HA-12114]

■ Walkin interview for 10th class, Intermediate, Graduates, Mechanics for gated community near Miyapur, Hyderabad. Ph 7989896938 [HA-11861]

WANTED TEACHERS
■ For All subjects Salary: 10K to 15k for High School 15K to 20k Send your resumes through Whatsapp. Cell: 7995850051, Shantiniketan High School, Durgeshwaraswamy Temple Lane, Warangal [WA-17674]

■ Wanted teachers to teach 3rd to 7th class English. Maths. E v S & Waddens St. Theresa School 8801802586, 9397696508 [MW-13542]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన రూ॥ 260/- అదనపు లైను రూ॥ 60/- మాత్రమే 5% GST అదనము

ఈ పేజీలో ప్రకటనల కొరకై సంప్రదించండి
వరంగల్ : 9705748198
నర్సంపేట : 9553955722
జనగామ : 9951602871
మహబూబాబాద్ : 9010144453
పరకాల : 9010299096
జయశంకర్ భూపాలపల్లి : 9705748198

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.